ఆంధ్రజ్యోతి



# వైద్యంలో రాష్ట్రానిదే అగ్రస్థానం: స్టాలిన్

ప్యారిస్, ఫిబ్రవరి 12 (ఆన్‌లైన్) : నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందజేయడంలో దేశంలోనే రాష్ట్రం అగ్రస్థానంలో వుందని ఉపముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. స్థానిక పోరూర్‌లోని శ్రీ రామచంద్రా వర్శిటీలో శుక్రవారం ఛాన్సలర్ వెంకటాచలం అధ్యక్షతన రక్తనాళాల సమస్యలపై పరిశోధనా విభాగాన్ని స్టాలిన్ ప్రారంభించారు. రక్తనాళ సమస్యలు పుట్టుక నుంచే తలెత్తుతున్నాయని, దీనిపై పరిశోధనలు నిర్వహించేందుకు ఎస్ఆర్‌యూ సంస్థ ముందుకు రావడం ప్రసంశనీయం అన్నారు. ఈ సంస్థ ఇప్పటికే గుండె, మధుమేహం తదితర సమస్యలపై చెన్నయ్, తిరువళ్ళూర్, కాంచీపురం జిల్లాల్లో 8025మందికి పరీక్షలు జరిపిందన్నారు. ఈ పథకాం విజయవంతం అయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. పేదల ఆరోగ్యం కోసం వనమున్ కాప్పోం పథకం, చిన్నారుల గుండె సమస్యల పరిష్కార పథకాలతో లక్షలాదిమందికి కార్పొరేషన్ వైద్యం ఉచితంగా అందజేశామన్నారు. 2007లో ముఖ్యమంత్రి ప్రారంభించిన ఈ పథకం కింద 26 కార్పొరేట్ ఆసుపత్రులలో గుండె శస్త్రచికిత్స చేయించుకున్న 1205మంది, గుండె శస్త్రచికిత్స పథకంలో 26 కార్పొరేట్ ఆసుపత్రిలో 1927మంది లబ్ది పొందారన్నారు. కలైంజర్ బీమా పథకం ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా పరిచయం చేస్తామని ప్రకటించారన్నారు. దీనిపై అధ్యయనం చేసేందుకు త్వరలోనే కేంద్రబృందం రాష్ట్రానికి వస్తుందన్నారు. ముఖ్యమంత్రిని మూడు రోజుల క్రితం మర్యాదపూర్వకంగా కలుసుకున్న మలేషియా ప్రధాని రాష్ట్ర వైద్య సేవలను ఉపయోగించుకునేందుకు మలేషియా ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని కోరారని, ఈ రకంగా వైద్య రంగంలో తమిళనాడు అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్ సెల్వం, ప్రిన్స్‌పల్ కార్యదర్శి వీకే సుబ్బురాజ్, ఎస్ఆర్‌యూ వైద్య అధికారులు తనికాచలం, సోమసుందరం, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరిశోధనలపై రూపొందించిన సావనీరును విడుదల చేస్తున్న ఉప ముఖ్యమంత్రి స్టాలిన్, ఆరోగ్యశాఖ మంత్రి పన్నీర్‌సెల్వం, ఛాన్సలర్ వెంకటాచలం తదితరులు